


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 237 | పేజీలు - 08 | వెల - 05/- | ఆదివారం 23-08-2026


**కర్నూలు జీజీహెచ్‌లో ఘనంగా 'స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర'**





## మన ఊరు--మన బాధ్యతతో

-అలమండ కోడూరు స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు

# స్వచ్ఛాంధ్ర సాధిద్దాం

ప్రారంభంకాకుండానే నీళ్లు ఇంకిపోతున్నాయని అపోహలు సృష్టి



- పరిశ్రమలు, ఫార్మా కేంద్రాలు, పెట్టుబడులతో నాలెడ్జ్ ఎకానమీ
- డేటా సెంటర్లపై కొందరు తప్పుడు ప్రచారం
- ప్రతిగ్రామం జీరో వేస్ట్ గ్రామంగా మారాలి
- గ్రూప్-1లో అక్రమాలతో ఏపీపీఎస్సీపై నమ్మకాన్ని దెబ్బతీశారు
- గత పాలకుల తప్పిదాలను సరిదిద్దేందుకే మూడేళ్ల సమయం



మాడుగుల, ఆగస్టు 22: ఉత్తరాంధ్రను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని... అనకాపల్లి జిల్లాను రాష్ట్రంలోనే నంబర్-1 జిల్లాగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అనకాపల్లి ఇక బెల్లానికి మాత్రమే ప్రసిద్ధి చెందిన ప్రాంతం కాదని, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, డేటా సెంటర్లు, ఫార్మా, అల్యూమినియం తదితర పరిశ్రమలకు కేంద్రంగా మారుతోందని చెప్పారు. అనకాపల్లిని అన్ని కంపెనీలకు కేంద్రంగా, నాలెడ్జ్ ఎకానమీకి చిరునామాగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అలమండ కోడూరులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా స్వచ్ఛ అలమండ కోడూరుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించిన గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనకాపల్లి జిల్లా ఎన్డీఏకు కంచుకోటగా నిలిచిందని సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో అనకాపల్లికి పెట్టుబడులు రాకపోవడంతో జిల్లా వెనుకబడిపోతుందని చాలామంది ఆందోళన చెందారని, ఇప్పుడు విశాఖకు మించి అనకాపల్లికి పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ సిటీ నిర్మాణం జరుగుతోందని, డేటా సెంటర్లు, ఫార్మా, అల్యూమినియం తదితర పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రకు మణిహారంగా ఏఎస్ఆర్ విమానాశ్రయాన్ని ఇటీవల ప్రారంభించుకున్నామని సీఎం చెప్పారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు రెక్కలు తొడుగుతుందని అన్నారు. ఏఐ, డేటా సెంటర్ల గురించి చిన్నారులు సైతం మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు. దేశంలో తొలిసారిగా క్వాంటం కంప్యూటింగ్‌ను రాష్ట్రానికి తీసుకురావడం గర్వకారణమని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు.

మిగతా 2లో

---

### గచ్చిబౌలిలో కూలిన భవనం..

## ఇద్దరి దుర్మరణం!

● గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం ● ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి ● అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్టు గుర్తింపు ● క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు




హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని

---

### నల్లమల సాగర్ కు

## కృష్ణా జలాలు.

- 31న సీఎం చేతుల మీదుగా వెలిగొండ ప్రారంభోత్సవం.
- నిర్వాసితులకు నేడు మరో 250 కోట్లు పరిహారం పంపిణీ.
- జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు.



వెనుకబడిన, ఫ్లోరైడ్ భాదిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్- 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింపజేయబోతున్నామని ఆయన వివరించారు. వెలిగొండ నిర్వాసితులకు సంబంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ

మిగతాది 2లో

---

### జోరుగా సీడ్ బాల్స్ వెదజల్లే

## కార్యక్రమం

50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో కీలక అడుగు

● 20 వేల హెక్టార్లలో 2 కోట్లకిపైగా సీడ్ బాల్స్ వెదజల్లారు ● ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి నిర్దేశకత్వంతో శరవేగంగా అడవుల పునరుద్ధరణ కార్యక్రమం ● అడవుల పునరుద్ధరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్న డ్రోన్ సాంకేతికత



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి 50 శాతం గ్రీన్ కవర్ సంకల్పం సాకారం

మిగతాది 2లో

---




### పవన్‌కు ఆయుర్వేద

## చికిత్స.

- భుజానికి ఆయుర్వేద వైద్యం చేయించుకోనున్న పవన్
- త్రిస్సూర్ సమీపంలోని ఆసుపత్రిలో ప్రత్యేక థెరపీ
- ఇటీవలే భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న జనసేనాని
- కొచ్చి విమానాశ్రయం నుంచి నేరుగా ఆసుపత్రికి పయనం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేరళ చేరుకున్నారు.

---



## బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం

● ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం
● కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం
● యువతను లక్ష్యంగా చేసుకుని 'యువ సంవాద్' కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
● యూపీ, పంజాబ్ ఎన్నికల సన్నద్ధతపై త్వరలో పార్టీ సమీక్ష

మిగతాది 2లో

---




## గచ్చిబౌలి విషాదం..

### అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం

● గచ్చిబౌలిలో ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరి మృతి
● ఘటనా స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ రంగనాథ్
● అంజయ్యనగర్‌లోని అక్రమ కట్టడాలన్నింటినీ కూల్చేస్తామని ప్రకటన
● సెట్‌బ్యాక్‌లు లేని భవనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని వెల్లడి

---

### రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

## తెలంగాణకు ప్రయోజనం

● రూ.7,000 కోట్లతో ఎల్‌పీజీ పైప్‌లైన్ విస్తరణకు కేంద్రం ఆమోదం ● తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం ● దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం ● ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్



దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది. ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది.ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర

మిగతాది 2లో

# నల్లమల సాగర్ కు కృష్ణా జలాలు.

మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభించబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు.

అలాగే వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న బాధ్యతకు, ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగాధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్ళు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు.

మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు 3 వేల కోట్లు పరిహారం అందజేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు లో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని రామానాయుడు హామీ ఇచ్చారు. కాగా నాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో వెలిగొండ పనులు పూర్తవ్వకుండా, జగన్ జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశాడన్నారు. ఎల్ నినో వంటి క్లిష్ట సమయం లో నల్లమల సాగర్ కు 10.7 టీఎంసీ ల కృష్ణా జలాలను తీసుకొస్తున్నా మంటే చంద్రబాబు ముందుచూపుకి, దార్శనికతకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్ లో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది అన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంఛార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు

# జోరుగా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం

శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి 50 శాతం గ్రీన్ కవర్ సంకల్పం సాకారం దిశగా వడివడిగా అడుగులు



పడుతున్నాయి. క్షీణించిన అడవుల పునరుద్ధరణ, పచ్చదనం పెంపొందించే లక్ష్యాలతో ఆయన ప్రారంభించిన సీడ్ బాల్స్ విస్తరణ కార్యక్రమం లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమం నిర్దేశిత లక్ష్యంలో 85 శాతం వరకు పూర్తయ్యింది. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమాజాలు, ఎన్జీవోలు, వివిధ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు ఒబఖుతీబ 2.06 కోట్ల సీడ్ బాల్స్ ను వెదజల్లే ప్రక్రియ పూర్తయ్యింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు మూలపాడు ఎకో పార్క్ లో మొదటి విత్తన బంతిని తయారు చేసి అధికారులు, ప్రజల్లో శ్రీ పవన్ కళ్యాణ్ గారు నింపిన స్ఫూర్తి 2.82 కోట్ల సీడ్ బాల్స్ తయారీకి బీజం వేసింది. ఉప ముఖ్యమంత్రివర్యుల సూచనలకు అనుగుణంగా స్వదేశీ, బహుళ ప్రయోజన జాతుల వృక్షాలకు చెందిన విత్తనాలతో తయారు చేసిన సీడ్ బాల్స్‌లో మెజారిటీ భాగాన్ని క్షీణించిన అటవీ ప్రాంతాల పునరుద్ధరణకు వినియోగించారు. ఇందుకోసం డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల ఆధారంగా ఇప్పటి వరకు 20,929 హెక్టార్ల విస్తీర్ణంలో సీడ్ బాల్స్ విస్తరణ ప్రక్రియను పూర్తి చేశారు. అటవీ అంచుల్లో క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది, సరిహద్దు గ్రామాల ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు.

అటవీ ప్రాంతాల్లో వర్షపాతం కొంత మెరుగవడంతో మానవ వనరులు అడుగుపెట్టలేని అడవుల మధ్య ప్రాంతాల్లో వృక్ష సంపద క్షీణించిన ప్రాంతాలను డ్రోన్ల సాయంతో గుర్తించి సీడ్ బాల్స్ వెదజల్లారు. ప్రాంతాల వారీగా భౌగోళిక పరిస్థితుల అనుకూలతల ఆధారంగా విత్తనాలను ఎంపిక చేశారు. తిరుపతి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ కార్యక్రమం విస్తృతంగా కొనసాగింది. అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది సీడ్ బాల్స్ తయారీ, రవాణా, విస్తరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సీజన్‌లో 3 కోట్లకు పైగా విత్తన బంతులు వెదజల్లాలన్న లక్ష్యాన్ని శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలతో అటవీ అధికారులు ముందుకు తీసుకువెళుతున్నారు. సీడ్ బాల్స్ విస్తరణ ప్రక్రియ సరికొత్త మైలురాయిని చేరుకున్న సందర్భంగా ఇందులో భాగస్వాములైన అటవీశాఖ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరినీ శ్రీ పవన్ కళ్యాణ్ గారు అభినందించారు. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో, అడవుల పునరుద్ధరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్న సీడ్ బాల్స్ విస్తరణ కార్యక్రమానికి కొనసాగింపుగా వెదజల్లిన ప్రాంతాల్లో మొలకల శాతం, మొక్కల ఎదుగుదల తదితర అంశాలపై కూడా అటవీ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు సూచించారు.

# మన ఊరు--మన బాధ్యతతో స్వచ్ఛాంధ్ర సాధిద్దాం

10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని చెప్పారు. ఈ ప్రాంత యువతకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి సమన్వయంతో అనకాపల్లిని భవిష్యత్తులో రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**లిడేటా సెంటర్లకు పోలవరం నీళ్లులి**

డేటా సెంటర్లపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం విమర్శించారు. డేటా సెంటర్ నిర్మాణం ఇంకా ప్రారంభం కాకముందే నీళ్లు ఇంకిపోతాయని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఒక డేటా సెంటర్ ప్రారంభిస్తే ఐదు డేటా సెంటర్ల స్థాయికి ప్రాజెక్టులు వచ్చాయని, ఐదు గిగావాట్ల సామర్థ్యం ఇక్కడికి వస్తే లక్షలాది మంది ఏఐ ప్రొఫెషనల్స్ తయారయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. అన్ని డేటా సెంటర్లకు కలిపి 3.5 టీఎంసీల నీరు మాత్రమే అవసరమవుతుందని తెలిపారు. పోలవరం నుంచి వచ్చే నీటితో అనకాపల్లి జిల్లాలోని ప్రతి చెరువును నింపుతామని స్పష్టం చేశారు. వచ్చే నెల మొదటి వారంలో అనకాపల్లికి గోదావరి నీటిని తీసుకువస్తామని సీఎం ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే నెల మొదటివారంలో అనకాపల్లికి నీరు పారిస్తామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులను రూ.29 కోట్లతో చేపడతామని, రైవాడ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. 30 ఏళ్ల క్రితం శ్రీకారం చుట్టిన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల31న ప్రారంభిస్తున్నామని సీఎం ప్రకటించారు. రెండేళ్లలో రాష్ట్రంలో రూ.2,250 కోట్లను అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశామని తెలిపారు.

**లిపర్యావరణాన్ని కాపాడుకుంటూ అభివృద్ధిలి**


అభివృద్ధి అంటే కేవలం పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలు రావడం మాత్రమే కాదని సీఎం అన్నారు. పరిశుభ్రమైన ప్రాంతాలు, స్వచ్ఛమైన పర్యావరణం కూడా అభివృద్ధిలో భాగమేనని చెప్పారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత, సమాజహితం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇళ్లు, రోడ్లు, పరిసరాలు అన్నీ మనవే అన్న భావనతో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ధర్మ కోనేరు పునరుద్ధరణ చేపట్టడాన్ని అభినందించారు. పారిశుద్ధ్య కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలను సీఎం అభినందించారు. మన ఊరు--మన బాధ్యత సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇల్లు, వీధి, కార్యాలయం, పాఠశాల, మార్కెట్.. ప్రతి ప్రదేశం పరిశుభ్రంగా ఉన్నప్పుడే స్వచ్ఛమైన పర్యావరణం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి గ్రామాన్ని జీరో వేస్ట్ గ్రామంగా మార్చాలని, ఉత్పత్తి అయ్యే ప్రతి వ్యర్థాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో గత రెండేళ్లలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చెత్తను గుట్టలు గుట్టలుగా పోగేశారని, వర్షాల సమయంలో ఆ చెత్త వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయన్నారు. చెత్త నుంచి సంపద సృష్టిస్తామని చెప్పినప్పుడు ఆశ్చర్యంగా చూశారని, ఇప్పుడు చెత్త నుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నామని చెప్పారు. స్వచ్ఛ రథాల ద్వారా గ్రామాల్లో వ్యర్థాలను సేకరించి, వాటికి ప్రతిఫలంగా నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతం పెంచేలా చర్యలు చేపట్టామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. స్వయం పేరుతో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండింతల సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. గత పాలకులు సంక్షేమం పేరుతో రోడ్లను పట్టించుకోలేదని విమర్శించిన ఆయన, తమ ప్రభుత్వం రోడ్ల రూపురేఖలు మార్చిందని ముఖ్యమంత్రి చెప్పారు.

**లిరాజకీయాల్లో చెత్తనూ తొలగించాలి...లి**

ప్రజలు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ప్రజలు మంచి నాయకత్వాన్ని ప్రోత్సహించినప్పుడే రాజకీయ నాయకులు కూడా తప్పులు చేయకుండా ఉంటారని చెప్పారు. మంచి పనులు చేయాలంటే రాజకీయాల్లోనూ ప్రక్షాళన అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజలు మంచి--చెడును విశ్లేషించి మంచి ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 2019--24 మధ్య ఐదేళ్లలో గత ప్రభుత్వం విధ్వంసం, నేరాలనే నమ్ముకుందని సీఎం విమర్శించారు. నకిలీ, కల్తీ మద్యం కారణంగా 30 వేల మంది అనారోగ్యంతో చనిపోయారని ఆరోపించారు. ఇష్టానుసారంగా కల్తీ మద్యం వ్యవహారాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో నచ్చని వారి భూములను 22ఏలో పెట్టిందని ఆరోపించారు. ఇప్పుడు ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం కింద రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను సరిదిద్దేందుకే తమకు మూడేళ్ల సమయం పడుతోందని సీఎం అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా గత పాలకులు వ్యవహరించారని ముఖ్యమంత్రి విమర్శించారు. మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు 300కు పైగా పిటిషన్లు దాఖలయ్యాయని సీఎం తెలిపారు. వాటన్నింటినీ ఎదుర్కొని ఉద్యోగ నియామకాలు చేపడితే, ఏడాది తర్వాత డీఎస్సీపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచేలా గతంలో వ్యవహరించారన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యమిస్తూ... వారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం పని చేస్తుంటే... క్రీడా కోటాలో ఉద్యోగాలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించడం సరికాదన్నారు. డీఎస్సీలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదని, జరగనివ్వబోమని స్పష్టం చేశారు. గ్రూప్-1 సర్వీసు పరీక్షల మూల్యాంకనంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని సీఎం ఆరోపించారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దడంతో అర్హులైన అభ్యర్థుల భవిష్యత్తు అంధకారమైందన్నారు. ప్లంబర్లు, ఇంటి పనివారు, అటెండర్లు, ఎలక్ట్రీషియన్లతో గ్రూప్-1 సర్వీసు పేపర్లు దిద్దించారని ఆరోపించారు. ఆ వాస్తవాలు వెలుగులోకి వస్తున్న సమయంలో డీఎస్సీపై ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. తప్పు చేసిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

**లిఅసమానతలు తగ్గాలి...పేదరికం పోవాలిలి**

ఆర్థిక అసమానతలు తగ్గి ప్రతి ఒక్కరి ఆదాయం పెరగాలని సీఎం అన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే అభివృద్ధికి అసలైన బెంచ్‌మార్క్ అని చెప్పారు. దీపం--2.0 ద్వారా మూడు గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన మొత్తాన్ని నాలుగు నెలలకు ఒకసారి ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్టంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం చెప్పారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వచ్చే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రపంచాన్ని జయించే విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి మన ఉపాధ్యాయులకు ఉందని చెప్పారు. 2047 నాటికి భారత్ అగ్రదేశంగా, వికసిత్ భారత్‌గా అవతరిస్తుందని సీఎం అన్నారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ కూడా 2047 నాటికి అధిక తలసరి ఆదాయంతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీలు సీఎం రమేష్, చింతకాయల విజయ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సహా జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

# తెలంగాణకు ప్రయోజనం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు. ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# గచ్చిబౌలి విషాదం.. అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన నేపథ్యంలో 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు.కేవలం 50 గజాల స్వల్ప విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా ఏడంతస్తుల భవనాన్ని నిర్మించడమే కాకుండా, దానిపై అదనంగా పెంట్‌హౌస్‌ను కూడా నిర్మించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బిల్డర్ సాజిద్ నిర్మించే భవనాలన్నీ అత్యంత నాసిరకంగా ఉంటాయని స్థానికులు ఆరోపిస్తున్నట్లు కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు.అంజయ్య నగర్ ప్రాంతంలో ఇటువంటి అక్రమ నిర్మాణాలు అనేకం ఉన్నాయని, కనీసం సెట్‌బ్యాక్‌లు కూడా పాటించకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారని రంగనాథ్ పేర్కొన్నారు. నాలాలను ఆక్రమించి ఇష్టారాజ్యంగా కట్టడాలు చేపట్టారని, వీటిలో అధిక శాతం ప్రస్తుతం హాస్టళ్లుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఆయా భవనాలను యజమానులు వెంటనే ఖాళీ చేయాలని ఆయన ఆదేశించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన అన్ని భవనాలను కూల్చివేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు. అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో మరో సమావేశం నిర్వహించనున్నారు. 'వందేమాతరం'పై బీజేపీ తీర్మానం ఇదే సమయంలో, 'వందేమాతరం' గౌరవాన్ని, చారిత్రక వారసత్వాన్ని కాపాడతామంటూ బీజేపీ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1937 నాటి తీర్మానానికి కట్టుబడి, జాతీయ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరాన్ని కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వందేమాతరం చరిత్ర, ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది.

# గచ్చిబౌలిలో కూలిన భవనం.. ఇద్దరి దుర్మరణం

చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. 'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

# పవన్‌కు ఆయుర్వేద చికిత్స

ఇటీవల ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న తన కుడి భుజానికి తదుపరి చికిత్సలో భాగంగా ఆయన ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయించారు. శనివారం సాయంత్రం కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా త్రిస్సూర్ బయలుదేరి వెళ్లారు.త్రిస్సూర్ సమీపంలో ఉన్న ఒక ప్రముఖ ఆయుర్వేద వైద్యశాలలో పవన్ కల్యాణ్ చేరారు. అక్కడ ప్రత్యేక థెరపీ ద్వారా ఆయనకు చికిత్స అందించనున్నారు. కొంతకాలంగా భుజం నొప్పితో బాధపడుతున్న పవన్ కల్యాణ్‌కు ఇటీవలే శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా, పూర్తిస్థాయిలో కోలుకునేందుకు ఆయన ఈ ఆయుర్వేద చికిత్స తీసుకోనున్నట్లు సమాచారం. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని, చికిత్స పూర్తయ్యే వరకు ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉండనున్నారని తెలుస్తోంది. పవన్ కల్యాణ్ వెంట పార్టీకి చెందిన కొందరు ముఖ్య నేతలు కూడా కేరళ వెళ్లినట్లు సమాచారం.

# ఇంటింటా తెలుగుదేశం కరపత్రాలను,






నందవరం పల్లె వెలుగు ఆగస్టు 22 ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బి.వి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మరియు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేశాయ్ మాధవరావు నిర్వహిస్తున్న 45 రోజుల ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో నందవరం మండలం 36 మరియు 38.బూతు ఇంచార్జ్ బెస్త ఈరన్న శ్రీనివాసులు ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలితాలను వివరించారు. ప్రతి కుటుంబానికి ఇంటింటా తెలుగుదేశం కరపత్రాలను అందజేస్తూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమం బూత్ ఇంచార్జ్ బెస్ట్ ఈరన్న డీలర్ మల్లికార్జున వెంకటేశ్వర్లు బసవరాజు మండల నాయకులు మరియు గ్రామ నాయకులు యువకులు తదుపరి పాల్గొన్నారు

## మద్దిలేటి స్వామి ఆలయానికి
# విరాళం అందజేస్తున్న దాతలు

### రూ.1.61 లక్షల విరాళం అందజేత





బేతంచెర్ల, పల్లె వెలుగు ప్రతినిధిఆగస్టు 22: నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బేతంచెర్ల మండలం =.ా.రంగాపురం శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి భక్తుల విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం నంద్యాల జిల్లా నత్తవాడకు చెందిన శ్రీ వి.రవిచంద్ర, కుమారి దివ్యజ్యోతి కుటుంబం రూ.1,01,116/- భారీ విరాళాన్ని ఆలయానికి అందజేశారు. అలాగే ఆలయ అభివృద్ధి నిమిత్తం డోన్ మండలం కన్నపకుంటకు చెందిన కాక్షి జయపాల్ రెడ్డి, కాక్షి లక్ష్మీదేవి దంపతులు రూ.50,100/-, డోన్ పట్టణానికి చెందిన అప్పేచర్ల మహేష్ కుమార్ రూ.10,000/- విరాళంగా సమర్పించారు. విరాళాలు అందజేసిన దాతలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్య, సభ్యులు మరియు ఉప కమిషనర్ ఒ కార్యనిర్వహణాధికారి వీ.రామాంజనేయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారి సేవలో తరించాలని కోరారు.

## స్లగ్: ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 22 కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో మెగాస్టార్





చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానుల తరఫున చిరంజీవికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వయంకృషితో సినీ రంగంలో అగ్రస్థానానికి ఎదిగి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న చిరంజీవి.. సేవా కార్యక్రమాలతోనూ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అభిమానూలు పేర్కొన్నారు. రక్తదానం, నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు ప్రకృతి విపత్తులు, కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలిచారని కొనియాడారు. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన చిరంజీవి.. క్రమశిక్షణ, అంకితభావం, నిరాడంబరతకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, చిన్న ఆకుల నాగరాజు, మక్బుల్, లక్కీ ఖలీల్ , శంకర్, పార్థు, ఈరన్న, వెంకటేష్, మూగతి ఈరన్న, మహానంది, జనసేన నాయకులు నాగరాజు, రవికుమార్, రాజు, విజయ్, అనిల్, ఈరన్న, సునీల్, రెహమాన్, ఎర్రన్న, రుక్మాన్, అరవింద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు..

# కర్నూలు జీజీహెచ్‌లో ఘనంగా 'స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర'

### పరిసరాల పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై చైతన్య ర్యాలీ.. మొక్కలు నాటిన అధికారులు






పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో 'స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా 3వ శనివారం జరగాల్సిన ఈ కార్యక్రమం, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కారణంగా 4వ శనివారం నాడు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**క్యాజువాలిటీ నుంచి డైట్ విభాగం వరకు ర్యాలీ:**

ఈ సందర్భంగా బయోమెడికల్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ క్యాజువాలిటీ విభాగం నుంచి డైట్ విభాగం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డైట్ విభాగం ప్రాంగణంలో ఆసుపత్రి అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. రోగులకు మెరుగైన వైద్యంతో పాటు ఆహ్లాదకరమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులు సూచించారు.

**భారీగా పాల్గొన్న వైద్య బృందం, సిబ్బంది:**

కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాయ్, డిప్యూటీ కలెక్టర్/అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఆర్ఎంవోలు డాక్టర్ వెంకటరమణ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పి. పద్మజ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వి. పద్మజతో పాటు నర్సింగ్ సూపరింటెండెంట్లు, నర్సింగ్ విద్యార్థినులు, శానిటేషన్ సిబ్బంది, ఇతర వైద్య విభాగాల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా ఆగస్టు 24 తేదీజరుగు ధర్నా లను జయప్రదం చేయండి. బి కే ఎం యు పిలుపు.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 24వ తేదీ సోమవారం జిల్లా లోని అన్ని మండల కార్యాలయం ఎదుట దన్నాలు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు. కే రాధాకృష్ణ. జిల్లా కార్యదర్శి. ఎస్ బాబా ఫక్రుద్దీన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పి నారాయణ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి హరినాథ్. ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సిపిఐ. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితిలో పిలుపుమేరకు ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు పాదయాత్రలు నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ కింది డిమాండ్స్ పై జీ రాంజీ. చట్టాన్ని రద్దు చేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఇండ్ల స్థలాలు .జీ రాంజీ. చట్టాన్ని రద్దు చేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని అన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆగస్టు 24వ తేదీ సోమవారం నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరణ చేయాలని, వి బి జి రామ్ జి చట్టం రద్దు కొరకు, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు పెన్షన్లు ఇవ్వాలని తదితర లోకల్ డిమాండ్లపై తహసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరారు.

# డివైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి,

### ఖాళీ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి,,,,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 22 నెల్లూరులో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న డివైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఎమ్మిగనూరులోని స్థానిక సుందరయ్య భవన్‌లో డివైఎఫ్ఐ నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు సురేష్, మండల కన్వీనర్ విజయ్, నాయకులు అజిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను గుర్తించి, వార్షిక ఉద్యోగ క్యాలెండర్‌ను పకడ్బందీగా అమలు చేసి, జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్, డీఎస్సీ తదితర పోస్టుల సంఖ్యను పెంచి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని, వయోపరిమితి దాటిపోతున్న నిరుద్యోగ యువతకు ప్రత్యేక అవకాశం కల్పించాలని కోరారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్, వసతి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం అందించాలని కోరారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ నాణ్యమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. యువత మద్యం, డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయని, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా యువతపై మత్తు పదార్థాల ప్రభావం పడుతోందని అన్నారు. యువతకు మెరుగైన విద్య, ఉపాధి, క్రీడా సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని అన్నారు. యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం డివైఎఫ్ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. నెల్లూరులో జరిగే సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో డివైఎఫ్ఐ 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాకేష్, దావీద్, హర్ష, బద్రి, వినయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె సంస్కృతి జానపద కళలను కాపాడుకోవాలి

### గురుకుల ప్రిన్సిపాల్ బొల్లా స్రవంతి



పటాన్ చెరు, ఆగస్టు 22, పటాన్ చెరు మండలంలోని చిన్న కంచర్ల గ్రామంలో గల బీసీ గురుకుల, మహాత్మ జ్యోతిబాపూలే, గురుకుల పాఠశాల కళాశాలలో విద్యార్థులు తెలుగు జట్టు కృత్యంలో భాగంగా ప్రపంచం జానపద దినోత్సవం, పురస్కరించుకొని గ్రామాలలోని సాంప్రదాయం సంస్కృతి, వేడుకలు, క్రీడా వినోదాల గురించి వివిధ వేషధారణలతో గ్రామంలో జరిగే వేడుకల గురించి, సంస్కృతి గురించి కళారూపంలో ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధి గురుకుల ప్రిన్సిపాల్ బొల్లా స్రవంతి, ఏటీపీ అనిల్ కుమార్, రేఖ లక్ష్మి,అధ్యాపకులు దేవయ్య,హుస్సేన్, రాజస్వామి,పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ స్రవంతి మాట్లాడుతూ.. గ్రామీణ ఉండే ప్రాంతాలలో ఆటలు పాటలు ఈ రోజుల్లో దాదాపుగా కనుమరుగైనాయి. ఈ నేపథ్యంలో శారీరక, మానసిక వికాసానికి దోహదపడే ఆటలు, వినోదాల గురించి, విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆటపాటలు మన సంస్కృతిలో భాగమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు, దేవులపల్లి రమేశ్,విజయ్ కుమార్, నాగరాజు, నగేష్, విద్యార్థులు, సాయికిరణ్, శివ సాయి రెడ్డి, మణీత్, దిలీప్, అనిల్, గణేష్, రామ్ చరణ్, యోగేష్,లక్ష్మణ్, అరవింద్, షాద్రాక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలకు ప్రతిరుపం. సిద్ధాంతమే ఊపిరిగా.

**-పార్లమెంటు మాజీ సభ్యులుకామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. భారత ప్రజాస్వామ్యానికి అంకితమైన ప్రజానాయకుడు మాజీ పార్లమెంట్ సభ్యులు.పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజా ఉద్యమ విప్లవానికి నాయకత్వం వహిస్తూ విద్యార్థి దశ నుంచే పోరాట బాట పట్టి ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా రెండుసార్లు, పార్లమెంట్ సభ్యుడిగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో ఆయన దృష్టి పెట్టారని చెప్పారు . రాష్ట్ర కమిటీలను బలోపేతం చేయడం, యువనాయకత్వానికి ప్రోత్సహించడం, మహిళల భాగస్వామ్ని పెంచడం, కార్మిక రైతు సంఘాలను సమన్వయం నందించడం వంటి అంశాలతో పాటు పార్లమెంటు సభ్యునిగా పార్లమెంటులో ప్రజా



సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ విధానాలను విమర్శించే అప్పుడు ఆయన వ్యక్తిగత విమర్శలు పోకుండా గణాంకాలు వాస్తవాలు రాజ్యాంగ సూత్రాలు ఆధారంగా తన వాదన వినిపించేవారని కొనియాడారు.

దేశంలో విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, పేదల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడు పదవుల కోసం కాదు ప్రజల కోసం జీవించిన నాయకుడు!ఆయన ఆశయాలు-విలువలు చిరస్మరణీయం! కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ని ఆయన ఆశయాలను నేటి విద్యార్థి యువత కొనసాగేందుకు ముందుకు కదిలి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి నాగరాముడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు జి లక్ష్మీదేవి, భూమని శ్రీనివాసులు, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ధనుంజయ్, డి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత, మహిళా సమైక్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్, సిపిఐ నాయకులు సరోజమ్మ, ఖలీల్, లక్ష్మణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ సురక్షిత చైతన్య యాత్ర ద్వారా దీపకుంట్ల జూనియర్ కళాశాల, విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన.

పల్లె వెలుగు దీబగుంట్ల గోస్పాడు మండలం దీబ



గుంట్ల గుండ్ల గ్రామంలో ఏపీ సాక్స్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దిశా లీడ్ ఆద్వర్యంలో హెచ్ఐవి/ఎయిడ్స్ , సుఖ వ్యాధుల లపై అవగాహన కార్యక్రమంలో జోనల్ సూపర్వైజర్ ఎస్ మీ రాంరెడ్డి లింక్ వర్కర్ ఎస్ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్.ఐ.వి వ్యాధి పట్ల యువత కు హెచ్.ఐ.వి పట్ల అవగాహన కలిగి ఉండడం వల్ల హెచ్.ఐ.వి కి గురికాకుండా చూసుకోవచ్చని, చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. హెచ్.ఐ.వి కేవలం అసురక్షిత లైంగిక సంబంధాలు , హెచ్.ఐ.వి ఉన్న గర్భిణీ నుండి పుట్టబోయే బిడ్డకు, హెచ్ఐవితో కలుషితమైన సూదులు సిరంజీలు, పరీక్షింపబడని రక్తము ద్వారా మాత్రమే సంక్రమించే అవకాశం ఉందని అన్నారు. ఇక ప్రభుత్వ ఆసుపత్రులలో హెచ్.ఐ.వి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, అలాగే పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

అదేవిదంగా,హెచ్.ఐ.వి. ఉంది అని నిర్ధారణ అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏ ఆర్ టి కేంద్రాలు, లింక్ ఏ ఆర్ టి కేంద్రాల ద్వారా ఉచితంగా ఏ ఆర్ టి మందులు అందుబాటులో ఉన్నాయని, మందులు వాడుతూ, వైద్యుల సలహాలు పాటించినట్లయితే ఎటువంటి ఆరోగ్య పరమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చు



అని తెలియచేసారు. హెచ్.ఐ.వి. ఉందనే కారణంతో వివక్ష చూపకూడదు అని, అది హెచ్.ఐ.వి./ ఎయిడ్స్ చట్టం - 2017 ప్రకారం శిక్షార్హమైన నేరమని తెలియచేసారు.

హెచ్.ఐ.వి. పట్ల ఎటువంటి సందేహాలు/ అనుమానాలు ఉన్నా జాతీయ హెల్ప్ లైన్ 1097 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలియచేసారు. కండోమ్ బాక్సు ఇబ్బందులు గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం ఉమ్మడి కర్నూల్ జిల్లాలో గ్రామాల్లో అవగహన సదస్సులు మరియు సేవలు అందించడం జరుగుతుంది. ముఖ్యముగా యువత, మహిళలు, పొదుపు సంఘాలు, కార్మికులు , గ్రామ ప్రజలను భాగస్వాములు చెయ్యాలి అని చేప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల బి . సీతారామాంజనేయులు, జూనియర్ ప్రిన్సిపల్ జోనల్ సూపర్వైజర్స్ మిరామిరెడ్డి, లింక్ వర్కర్ ఎస్ ఆంజనేయులు ప్రజలు పాల్గొనడం జరిగింది..

# వరి పంట వేయకండి.. ఆరు తడి పంటలు వేసుకోండి

మహానంది, పల్లె వెలుగు ఎల్నినో ప్రభావంతో వర్షాలు కురువవని శాస్త్రవేత్తలు స్పష్టంగా





తెలుపుతున్నారని,వరి పంట వేయవద్దని, వేస్తే రైతులు నష్టపోతారని, ఆరుతడి పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం మహానంది మండలం యు.బొల్లవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే రైతు వ్యవసాయ బావిలోని నీటి ఆధారంగా 3.75 ఎకరాల్లో డ్రమ్ సీడర్ వేసిన నంద్యాల సోనా రకం వరిపంటకు నీరుచాలక ఒక ఎకరామేర దున్నేసిన పంట పొలాన్ని పరిశీలించారు. ఏవో నాగేశ్వర్ రెడ్డి ఆ రైతుతోపాటు ఇతర రైతులకు వరిపంట మినహా ఆరుతడి పంటలు వేసుకోవాలని తెలిపారు. 2026లో వేసిన వరిపంటకు మాత్రమే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించడానికి ఈనెల 31వ వరకు గడువును ప్రభుత్వం పెంచిందన్నారు. ఈ అవకాశంకూడా బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న వరి రైతులకు మాత్రమే వర్తిస్తుందని,వాన్-లోన్ రెతులకు వరించదన్నారు.

# స్వచ్ఛ నంద్యాలకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు. మంత్రి ఫరూక్ పిలుపు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నూనెపల్లిలోని పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో



నంద్యాల పురపాలక సంఘం, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ నంద్యాల' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు స్వచ్ఛత, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలని, పరిశుభ్రమైన, పచ్చని నంద్యాల నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్ ఈ నాగభూషణం రెడ్డి. మెప్మా పీడీ వెంకట దాసు, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్. శభరిష్. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నంద్యాల ఆర్.ఆర్.ఎస్., మార్కెట్ యార్డ్లను తక్షణమే కాపాడాలి.



**యార్డులో జరుగుతున్న పశువుల సంతలో రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించిన నాయకులు.**

**● శాస్త్రవేత్తల ల్యాబ్‌లలో పాలన ఏంటి? కలెక్టరేట్‌ను వెంటనే బయటకు తరలించాలి. ● ఇది నాయకుల పోరాటం కాదు.. ప్రతి ఒక్కరి ఆహార భద్రత సమస్య. ● అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్. ● నూనెపల్లె మార్కెట్ యార్డును సందర్శించిన ఐక్యవేదిక నాయకులు.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రైతన్నల నోట్లో మట్టికొడుతూ, ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి ప్రభుత్వం నడుపుతున్న వ్యాపార, రాజకీయ ధోరణులపై అఖిలపక్ష ఐక్యవేదిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

నూనెపల్లె మార్కెట్ యార్డు పరిరక్షణ, 125 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుండి తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే ఖాళీ చేయించాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా నంద్యాల పట్టణంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టిన అఖిలపక్ష ఐక్యవేదిక నేతలు శనివారం నూనెపల్లె మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు.?ఈ సందర్భంగా యార్డులో జరిగిన పశువుల సంతకు విచ్చేసిన వేలాది మంది రైతులు, వ్యాపారులు మరియు ప్రజలను నేరుగా కలుసుకొని ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలను విడమరిచి చెప్పారు.

?ఈ సందర్శన సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ... "రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కేలా చేయడం, దళారీల మోసాల నుండి కాపాడడం, ధాన్యానికి తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పించడం కోసం ఎంతోమంది పెద్దల త్యాగాలు, కృషి ఫలితంగా ఈ మార్కెట్ యార్డ్ రూపుదిద్దుకుంది. యార్డ్ సిస్తు ద్వారా వచ్చే నిధులతో గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులు కల్పించేవారు. కానీ నేడు పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ యార్డ్ నిర్వీర్యమైపోయింది. మార్కెట్ యార్డుకు చెందిన భూముల్లో కూడా రాజకీయ ప్రయోజనాల కోసం, అధికార టీడీపీ కార్యాలయానికి రెండు ఎకరాల విలువైన స్థలాన్ని కేటాయించడం దుర్మార్గమైన చర్య" అని మండిపడ్డారు.

గతంలో ఎన్ ఎం సి నిబంధనల ప్రకారం నంద్యాలలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం 8 ఎకరాల యార్డ్ స్థలాన్ని కోరితే, "మార్కెట్ యార్డ్ బ్రహ్మాండంగా పనిచేస్తోంది, స్థలం ఇవ్వలేం" అని అప్పటి కలెక్టర్ కోర్టులో అఫిడవిట్ వేశారు. కానీ నేడు అదే స్థలాన్ని పార్టీ కార్యాలయానికి ఎకరా వెయ్యి రూపాయలకు చొప్పున కేటాయిస్తూ "యార్డ్ నిర్వీర్యమైంది" అని నివేదికలివ్వడం పాలకుల, అధికారుల ద్వంద్వ నీతికి నిదర్శనం అని ఎండగట్టారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ( ఆర్ కె వి వై, నాబార్డ్) ద్వారా పప్పుధాన్యాలు, ఆయిల్ సీడ్స్ పరిశోధనల కోసం నిర్మించిన ఆర్ఆర్ఎస్ భవనాలను 'కేవలం ఏడాది కాలపరిమితి' అని చెప్పి కలెక్టరేట్ కోసం తీసుకున్నారు. నేడు 5 ఏళ్లు గడుస్తున్నా ఖాళీ చేయకపోగా... ఒంటె ఎడారిలో డేరాను ఆక్రమించినట్లు షెడ్లు, క్యాంటీన్లు, హాల్స్ కట్టుకుంటూ శాస్త్రవేత్తల ప్రయోగశాలలను, రీసెర్చ్‌ను సర్వనాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు.

**?కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలి:**

ఆర్ ఏ ఆర్ ఎఫ్ భవనాల నుండి తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే ఖాళీ చేసి, వ్యవసాయ పరిశోధనలకు ఆ ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో అప్పగించాలి. అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నూనెపల్లె మార్కెట్ యార్డ్‌లో పార్టీ ఆఫీస్ కోసం కేటాయించిన 2 ఎకరాల భూమిని తక్షణమే వెంటనే వెనక్కి తీసుకోవాలనీ, యార్డ్‌ను ఆధునీకరించి రైతుల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.?ప్రజల ఆహార భద్రతకు, రైతు సంక్షేమానికి వెన్నుముక లాంటి ఆర్.ఆర్.ఎస్., మార్కెట్ యార్డ్‌లను కాపాడుకోవడానికి ప్రజా ఉద్యమం ఉధృతం అవుతోంది. న్యాయశాఖ మంత్రి ఈ ప్రాంత ప్రజలకు చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకోవాలి. ప్రజలు తిరగబడకముందే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి అని ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు.

?నంద్యాల ఆర్.ఆర్.ఎస్., మార్కెట్ యార్డ్ భూముల రక్షణ కోసం సిపిఐ, సిపిఎం, స్థానిక ప్రజా సంఘాలు, రైతు నాయకులు కలసికట్టుగా పోరాడుతుంటే... రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నోరు మెదపకపోవడం దారుణం. అధికార టిడిపి బహిరంగంగా రైతు ఆస్తులను ఆక్రమిస్తుంటే,ప్రతిపక్ష వైసిపి కనీసం ప్రశ్నించకపోవడం చూస్తుంటే అధికార, ప్రతిపక్షాలు రెండూ లోపాయికారీగా కుమ్మక్కయ్యాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి, రైతాంగ పోరాటాల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు. ఇప్పటికైనా విపక్షాలు తమ మౌనాన్ని వీడి ఈ పోరాటంలో కలిసిరావాలి, లేకపోతే ప్రజల ముందు నిలదీత తప్పదని హెచ్చరించారు.

?ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ఎస్ డి పి ఐ నాయకులు ఏజెస్ హుస్సేన్, న్యూ డెమోక్రసీ పట్టణ నాయకులు చౌడప్ప, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమన్న, విశ్రాంత ప్రొఫెసర్ శివరాం రెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు షణ్ముఖరావు, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చికిత్సతో క్షయ వ్యాధి నిర్మూలన



మహానంది, పల్లె వెలుగు క్షయ వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలోనే గుర్తించి పూర్తి కాలం మందులు వాడడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చని వైద్యాధికారి డాక్టర్ భగవాన్ దాస్ పేర్కొన్నారు. శనివారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 80 మందికి హ్యాండిల్ ఎక్రేస్ ద్వారా ఎక్రేసలు తీశారు. ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులు మంచి పౌష్టికాహారం తీసుకుంటూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ హుస్సేన్ రెడ్డి, పి హెచ్ ఎన్ అమినాబి, సిబ్బంది పాల్గొన్నారు.

# గడివేముల జీజీహెచ్‌లో 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర'పరిసరాల పరిశుభ్రత, కార్యక్రమం..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండల ప్రభుత్వ ఆసుపత్రి






పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని డాక్టర్ సుచరిత ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రాంగణంలో 'స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా 3వ శనివారం జరగాల్సిన ఈ కార్యక్రమం, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కారణంగా 4వ శనివారం నాడు చేపట్టినట్లుతెలిపారు.అనంతరం ఆస్పత్రి విభాగం ప్రాంగణంలో ఆసుపత్రి అధికారులు, సిబ్బందితో పిచ్చి మొక్కలను చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు . రోగులకు మెరుగైన వైద్యంతో పాటు ఆహ్లాదకరమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, ఆశ వర్కర్లు, శానిటేషన్ సిబ్బంది, ఇతర వైద్య విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వరునికి పల్లకి మహోత్సవం

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో కొలువైన శ్రీదేవి



భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారికి పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ప్రధాన అర్చకులు నరసింహ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో కొలువు తీర్చి పూజలు నిర్వహించారు.పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి శనివారం ఉదయం భక్తులకు అల్పాహారణ వితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించాలని కోరారు

# మద్యం మత్తులో స్టీరింగ్ పడితే జైలుకే పోలీసుల హెచ్చరిక.

## చిన్నటేకూరు రోడ్డుపై ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.

పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. మద్యంతాగి వాహనాలు నడిపి నిండు ప్రాణాలను బలితీసుకుంటే



ఉపేక్షించే ప్రసక్తే లేదని పోలీసులు హెచ్చరించారు. చిన్నటేకూరు నుంచి బస్తిపాడు వెళ్లే ప్రధాన రహదారిపై పోలీసులు మెరుపు తనిఖీలు చేపట్టారు. రహదారి ప్రమాదాల నివారణే ధ్యేయంగా 'డ్రంక్ అండ్ డ్రైవ్' స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, రాక పోకలు సాగిస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బ్రీత్ అనలైజర్ల ద్వారా వాహనదారులకు ఆల్కహాల్ టెస్టులు నిర్వ హించారు. ఈ సందర్భంగా అధి కారులు మాట్లాడుతూ... "మీ క్షణికా నందం కుటుంబాలకు జీవితాంతం తీరని శోకాన్ని మిగులు స్తుంది. మద్యం మత్తు లో వాహనాలు నడపడం నేరం మాత్రమే కాదు, తోటి ప్రయాణికుల ప్రాణాల మీదకు తెచ్చుకో వడమే" అని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతామని వార్నింగ్ ఇచ్చారు. సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రతి ఒక్క రూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్పష్టంచేశారు.

# దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలి, దళిత క్రిస్టియన్ లో పైన దాడులను అరికట్టాలి.

- రౌండ్ టేబుల్ సమావేశం.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సీఐటీయూ,డివైఎఫ్ఐ, ఆధ్వర్యంలో స్థానిక నంద్యాల పెద్ద చర్చి ఎదురుగా రైడర్ మెమోరియల్ కమ్యూనిటీ హాల్ నందు రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది,ఈ సమావేశానికి కెవిపిఎస్ జిల్లా నాయకులు పుల్ల నరసింహులు అధ్యక్షత వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కె వి పి ఎస్ జిల్లా నాయకులు ఏసురత్నం , బాంసేపు నాయకుడు ప్రముఖ గుండె వైద్య నిపుణులు, క్రాంతి చైతన్య , ఏసు కృపా మినిస్ట్రీస్ ఫౌండర్ బ్రదర్ అందనం సుధాకర్ , క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి మన్యం జానయ్య , రిపబ్లిక్ ఆన్ పార్టీ అధ్యక్షులు లింగస్వామి , వైయస్సార్ నగర్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్ , సిఐటియు పట్టణ కార్యదర్శి వెంకట లింగం , ముస్లిం జేఏసీ నాయకులు అబులైజ్ , ప్రముఖ దైవజనురాలు హెప్సిబా , పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి రాంబాబు , దళిత మహిళా సేన రాష్ట్ర అధ్యక్షులు రోజమ్మ , డివైఎఫ్ఐ పట్టణం కార్యదర్శి శివ,తదితరులు పాల్గొని ప్రసంగించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా,రాష్ట్రవ్యాప్తంగా దళిత క్రిస్టియన్స్ మీద దాడులు విపరీతంగా పెరిగాయని,దళిత క్రిస్టియన్లకు ఎస్సి హోదా ఉండకూడదని వివిధ మత సంస్థలు, దళితులను ఇబ్బంది పెడుతున్నాయని వారు అన్నారు, దళిత క్రిస్టియన్లకు స్మశానాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని ప్రభుత్వాలు పట్టించుకోకుండా దళిత క్రిస్టియన్ నన్ను అంటరాని వారిగా చూస్తున్నారని అన్నారు, అంతే కాకుండా అధికార పార్టీ నాయకులు సమాజంలో కులాలు లేవు, మతాలు లేవు , సమాజం అంతా బాగుందని వారు అంటున్నారు, కానీ మేము దళితుల సమస్యల పైన సర్వే చేస్తే వివిధ సమస్యలను బయటకు వచ్చాయని వారు అన్నారు. దళిత కాలనీలో కాలువలు శుభ్రం లేదు డ్రైనేజీ వ్యవస్థ నీటుగా లేదని నెలల తరబడి కాలువలలో చెత్త తియ్యడం లేదని,దళితవాడలో టైఫాయిడ్,మలేరియా లాంటి జబ్బులు విలయ తాండవం చేస్తున్నాయని వారు అన్నారు. కాబట్టి దళితుల సమస్యల పైన వివిధ రూపాలలో కార్యక్రమాలు చేస్తున్నామని వారు అన్నారు. ఈ నెల 24వ తేదీన సోమవారం రోజున దళిత సమస్యల పైన స్థానిక నంద్యాల కలెక్టర్ ఆఫీస్ ముందు భారీ ధర్నా చేపడుతున్నామని వారు అన్నారు,దళితుల సమస్యలను జిల్లా వ్యాప్తంగా తీసుకొని పనిచేస్తున్నామని వారు అన్నారు, ఇంకా గ్రామాలలో అంటరానితనం ఉందని వారు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం.

1.దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలి.
2.దళిత క్రిస్టియన్ల పైన దాడి దాడులు ఆపాలి.
3.అన్ని పట్టణ గ్రామాలలో జీవో నెంబర్ 1235 ప్రకారము దళితులకు స్మశాన వాటికలు కేటాయించాలి, 4.నంద్యాల జిల్లాలో దళితులకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలి.
5.అన్ని దళితవాడ లల్లో సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలి, కాలువలు శుభ్రం చేయాలి. పై సమస్యల పైన నిరంతరంగా కలిసి వచ్చే ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తామని వారు తెలిపారు. అదేవిధంగా ఈ సమస్యలు పరిష్కారాలు కాకపోతే చలో విజయవాడ కార్యక్రమాన్ని కూడా చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ నాయకులు వైయస్సార్ నగర్ సామేలు , సిఐటియు అధ్యక్షులు గౌస్ , సిఐటియు జిల్లా నాయకులు దర్శనం లక్ష్మణ్, సిఐటియు సీనియర్ నాయకులు తోట మద్దులు, దైవ సేవకులు పీటర్, యెహోవా షేమ్మ చర్చి దైవజనులు అనంద్, దైవజనులు మోహన్ బాబు , యువ నాయకుడు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు గొంతు నొక్కుతున్న కూటమి సర్కార్!

## శ్రీశైలం నీళ్లపై దగా.. రైతాంగానికి తీరని అన్యాయం
## గోరకల్లు నుంచి ఎస్సార్బీసీకి తక్షణమే నీరు వదలాలి: మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ధ్వజం




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కూటమి ప్రభుత్వ కక్షపూరిత, నిర్లక్ష్య వైఖరి వల్ల కర్నూలు జిల్లా ప్రజలు గుక్కెడు తాగునీటికి, సాగునీటికి అల్లాడే దుస్థితి దాపురించిందని వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి నిప్పులు చెరిగారు. పాణ్యంలోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి పాలకుల తీరును ఆయన తీవ్రస్థాయిలో ఎండగట్టారు.

**త్యాగాలను కాలరాస్తారా?:**

134 కిలోమీటర్ల హంద్రీనీవా ప్రాజెక్టు కోసం రైతులు తమ విలువైన భూములను త్యాగం చేస్తే.. నేడు అదే అన్నదాతలకు చుక్క నీరు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ముందు హంద్రీనీవా పరిధిలోని చెరువులను నింపి ప్రజల దాహం తీర్చండి బాబు గారు" అంటూ మండిపడ్డారు.

**పోలీసు పహారాలో దౌర్జన్య పాలన:**

గోరకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీ కాలువకు నీటిని విడుదల చేస్తే పాణ్యం, బనగానపల్లె నియోజకవర్గాల్లోని వేలాది కుటుంబాల తాగునీటి సమస్య తీరుతుందని స్పష్టం చేశారు. గాలేరు-నగరికి నీళ్లిస్తున్న ప్రభుత్వం, ఎస్సార్బీసీకి మాత్రం పోలీసుల అండతో అడ్డుపడుతూ నియంతలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. స్థానిక మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి వెంటనే నీరు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణ దోపిడీపై సీఎం చంద్రబాబు నోరెందుకు మెదపరు?:**

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తెలంగాణ ప్రభుత్వం రోజువారీగా మోటార్ల ద్వారా నీటిని తోడేస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తుంటే.. మన రాష్ట్రంలో జనం, మూగజీవాలు గొంతు ఎండి చస్తుండటం ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు .. మీ ఆప్తమిత్రుడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి మోటార్ల ద్వారా జరుగుతున్న నీటి దోపిడీని తక్షణమే ఎందుకు ఆపించలేకపోతున్నారు?" అని నిలదీశారు.

**మొద్దునిద్ర వీడండి.. పోతిరెడ్డిపాడు వద్ద సమరభేరి:**

రైతులు, ప్రజల సహనాన్ని పరీక్షించకుండా ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి తక్షణ పరిష్కారం చూపాలని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు సోమవారం మాజీ మంత్రి శైలజానాథ్‌తో కలిసి ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్సీపీ శ్రేణులంతా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు తరలివెళ్లనున్నట్లు కాటసాని రామభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రతి గడపలో ఆప్యాయత.. ప్రతి మనసులో భరోసా

**ప్రజా సమస్యలపై పోరుబాటలో ఎర్రకోట రాజీవ్‌రెడ్డి**






ఎమ్మిగనూరు, ఆగస్టు 22 (పల్లె వెలుగు): 'నమస్తే ఎమ్మిగనూరు.. ప్రజా సమస్యలపై పోరుబాట' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రకోట రాజీవ్‌రెడ్డి శనివారం పట్టణంలోని 11వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలు, యువత, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్న రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కుటుంబ వారసుడిగా, మీ కుటుంబంలో ఒకరిగా మీ ముందుకు వచ్చాను. మీకు ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకురండి. మీ కోసం నా వంతు పోరాటం చేస్తాను" అని భరోసా ఇచ్చారు.

**హామీల అమలుపై ప్రజల ఆవేదన**

కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల అమలుపై రాజీవ్‌రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 'తల్లికి వందనం', ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందడం లేదని పలువురు మహిళలు తెలిపారు. కొత్త వితంతు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు కావడం లేదని కొందరు మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రాజీవ్‌రెడ్డి అర్హులకు పింఛన్లు అందేలా అధికారులతో మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే తన బాధ్యతని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రాజీవ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు రియాజ్, ఖాసీం బేగ్, మాచాని వెంకటేష్, సునీల్‌కుమార్, షబ్బీర్, నటరాజ్‌రెడ్డి, రాజు, భాస్కర్‌రెడ్డి, రజాక్, రాము, లియాకత్, శ్రీధర్‌రెడ్డి, పామయ్య, సోమేశ్, మాచాని రఘు, ఉమేష్, వడ్డే వీరేష్, ప్రభాకర్, గోకారి, చాంద్‌బాషా, బాబూలాల్, ప్రకాష్‌రెడ్డి, గిడ్డయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలు,

# నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి.




**☛పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.**

**☛శాంతిభద్రతలు, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఎస్పీ సునీల్ షరాన్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

వినాయక చవితి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోనే వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ నిమజ్జన పై జిల్లా ఎస్పీ సునీల్ షరాన్, డి ఆర్ ఓ రాము నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలనీ తెలిపారు. 2024, 2025 సంవత్సరాల్లో చేపట్టిన విధంగానే ఈ సంవత్సరం గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నందున గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవంతంగా ఏర్పాట్లును చేయాలని సూచించారు. సెప్టెంబర్ 14 న వినాయక చవితి ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. ఉత్సవాలు, నిమజ్జన తేదీలు ముందుగానే ఖరారు చేసి, అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టరేట్ నుంచి 2,500 మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, పర్యావరణహిత వినాయక చవితి నిర్వహణకు ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా రహదారుల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి చిన్న చెరువు వరకు నిమజ్జన ఊరేగింపులు జరిగే మార్గాల్లో ఉన్న గుంతలను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే పూడ్చి రహదారులను సురక్షితంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఊరేగింపుల సమయంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత నిమజ్జన, ఊరేగింపు మార్గాల్లో ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తుగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని చిన్న చెరువు వద్ద ఐదు నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేసీ కెనాల్ అధికారులతో సమన్వయం చేసుకుని నిమజ్జనానికి అవసరమైన స్థాయిలో నీటి మట్టాన్ని నిర్వహించాలని సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద 24 గంటల లైటింగ్, పారిశుధ్యం, తాగునీరు, జనరేటర్లు, ఫైర్ సేఫ్టీ, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పెద్ద విగ్రహాల నిమజ్జనానికి నీరు సరిపోని ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక చెరువులు ఏర్పాటు చేసేందుకు ముందస్తు ప్రణాళిక






సిద్ధం చేయాలని సూచించారు. ఈతగాళ్లు, పడవలు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలనీ తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిమజ్జన ప్రదేశాల వద్ద అవసరమైన సంఖ్యలో పుట్టీలు, పడవలు, శిక్షణ పొందిన ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అధికారులు 24/7 షిఫ్టుల వారీగా విధుల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ, రవాణా శాఖలు ముందుగానే రూట్ డైవర్షన్ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు మంచి కండిషన్‌లో ఉన్న క్రేన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వైద్య, అత్యవసర సేవలు సిద్ధంగా ఉండాలనీ నిమజ్జన ప్రదేశాల వద్ద 108, 104 అంబులెన్సులతో పాటు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్య సేవలకు నంద్యాల జీజీహెచ్ ఆసుపత్రిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఎన్నికల పనులు కూడా సమాంతరంగా పూర్తి చేయాలనీ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల పరిశీలన, ఓటర్ల జాబితా తదితర పనులను గణేష్ ఉత్సవాల ఏర్పాట్లతో పాటు సమాంతరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులు, ఉత్సవాల ఏర్పాట్లలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల వారీగా బాధ్యతలు స్పష్టంగా కేటాయించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లు శాంతిభద్రతలు, భద్రతా దిశగా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, స్థానిక సమస్యల పరిష్కారం, రాబోయే పండుగలు, కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్టమైన ముందస్తు కార్యాచరణ రూపొందించాలన్నారు.

వినాయక చవితి సందర్భంగా ముందుగానే రూట్ మ్యాప్ సిద్ధం చేసి ట్రాఫిక్ మళ్లింపు పార్కింగ్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. విగ్రహాల సంఖ్య, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలు తదితర అంశాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి జిల్లా స్థాయికి నివేదించాలని తెలిపారు. సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, ఎక్కడైనా ముందస్తుగా సమస్యలు లేదా భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటే వాటిని ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అన్ని కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాలు ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ ద్వారా పరిస్థితిలో పర్యవేక్షించాలన్నారు.

జిల్లాలోని కొన్ని ప్రాంతాలు సున్నితమైన ప్రాంతాలుగా ఉన్నప్పటికీ ప్రజల సమైక్య సహకారం, పోలీసు శాఖ మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. సమన్వయం, సంయమనం, సామాజిక బాధ్యతతో వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో కలిసి కాలుష్యరహిత వినాయక చవితి పోస్టర్లు జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొంటున్నారు.

# నంద్యాల జిల్లాస్థాయి చెస్ పోటీలు ప్రారంభం.

**● ప్రారంభించిన నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ. ● 12 వివిధ వయసు కేటగిరీలలో వేరు వేరు గా పోటీలు. ● వేదిక: ఎన్జీవోస్ కాలనీ లో ఉన్న అచీవర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ ఆర్ జి చెస్ అకాడమీ నిర్వహణలో శనివారం నంద్యాల ఎన్జీవోస్ కాలనీలో ఉన్న అచీవర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు జిల్లా స్థాయి చెస్ పోటీలు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం చాలా అవసరమన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి చదువుతోపాటు కళలు,క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న అచీవర్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మానస మాట్లాడుతూ చదరంగం క్రీడ మేథో శక్తిని,ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని అన్నారు. జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ చంద్రశేఖర్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్




సుబ్బా రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలు 12 వివిధ వయసు విభాగాల్లో వేరు వేరుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల లో ప్రతిభ కనబరిచిన వారికి ఒక్కొక్క క్యాటగిరి లో 10 ప్రైజ్ ల చొప్పున మొత్తం 120 ప్రైజ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు. అచీవర్స్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ టోర్నమెంట్ కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా ఈశ్వర్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మానస, పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య, చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు వంశీ, టోర్నమెంట్ ఆర్గనైజర్ అరుణ్ కుమార్, ఆర్బిటర్స్ మహేష్ మాలిక్ సురేష్ జయంత్ మాధవి రమ్య మణికుమార్,200 మంది చెస్ క్రీడాకారులు, కోచ్ లు క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## లోన్ యాప్ మోసాలకు బలికావద్దు

హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 22 గజ్జహల్లి గ్రామంలో మహిళలపై జరుగుతున్న



నేరాలు, సైబర్ నేరాలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోళగుంద ఎస్సై దిలీప్ కుమార్ ప్రజలకు పలు సూచనలు చేశారు. లోన్ యాప్ మోసాలు, ముద్ర లోన్ పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, హనీ ట్రాప్ వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వవద్దని హెచ్చరించారు. మహిళల రక్షణకు సంబంధించిన నిర్భయ చట్టం, పోక్సో చట్టం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై ఎలాంటి వేధింపులు లేదా నేరాలు జరిగినా భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు సంయమనం పాటిస్తూ ప్రజాశాంతికి, శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలిగించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై దిలీప్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు భద్రత, ఎన్నికల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర సాధనకు అందరూ సహకరించాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. స్వర్ణాంధ్ర–



స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం ద్వారా స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలందరూ సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా శ్రమించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ, రామునాయక్ కలెక్టరేట్ ఎఓ సుభాకర్ రావు, డిఎస్ఓ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలన్నారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణకు గాను ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ రోజువారీ అవసరాల కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్ బ్యాగులు ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పొందాలన్నారు. ఈ విషయంలో ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమని, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం ద్వారా జిల్లా పరిశుభ్రంగా ఉంటుందన్నారు. అనంతరం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ విస్తృతంగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించి పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించారు. అదే విధంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.



# ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించండి

ఆళ్లగడ్డ: ప్రతినిధి ఆగస్టు 22 పల్లె వెలుగు ప్రజలకు మరింత మెరుగైన సేవలను




అందించాలని వారికి తాము తోడ్పాటును అందిస్తామని జిల్లా అధికారి ఎస్ఓ డాక్టర్ సుజాత అన్నారు. పట్టణంలోని ఎంవి నగర్ లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లో శనివారం డిటిఎఫ్ వెరిఫికేషన్, ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎమ్ ల విధి విధానాలు పరిశీలించారు. నెలవారీ నివేదికలు, ఆర్ సిహెచ్, హెచ్ఐఎంఎస్, అనీమియా పోర్టల్లలో నమోదు చేసిన వివరాలు, లబ్ధిదారులకు అందించిన వెరిఫికేషన్ నిర్వహించారు. వారిచ్చిన డేటాను వెరిఫికేషన్ చేసుకొని ఎవరైతే తక్కువ సర్వీసులు అందించి ఉంటారో వారి నుండి ఫీడ్ బ్యాక్ తీసుకొని మెరుగైన సేవలను ఇంకా అందించే విధంగా వారికి తోడ్పాటును అందిస్తామని ఎస్ ఓ సుజాత తెలిపారు . డిపిఎమ్ఓ దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ డిటిఎఫ్ వెరిఫికేషన్ ఆల్ ఇన్ ప్రోగ్రామ్ గత ఐదు సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నామని దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి వారికి వివిధ రకాలైనటువంటి ఆరోగ్య సేవలను అందించేందుకు ఆశ వర్కర్స్ మరియు ఏఎన్ఎంలు సర్వీసులు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ నస్రీన్, కేపీ శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ లు నరసింహులు, దీపిక రెడ్డి, ఎంపీహెచ్ఓ బాబయ్య, ఎంఐఎస్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడు హోంగార్డ్ విజయ్ కుమార్
# కుటుంబానికి ఆర్థిక సహాయం



,
ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 22 పల్లె వెలుగు ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్ లో హోంగార్డుగా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విజయ్ కిరణ్ కుటుంబ సభ్యులకు శనివారం 21,500/- రూ. ఆర్థిక సహాయాన్ని సహచర హోంగార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎల్సి నజీర్ అహ్మద్, హోంగార్డులు రవిశంకర్ , రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ ఆర్టీసీ బస్టాండ్ లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు



,ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 22 పల్లె వెలుగు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం ఆర్టీసీ అధికారులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిపో మేనేజర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది లక్ష్మీనరసింహ బస్టాండ్ ఆవరణ లోని చెత్తాచెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. డిపో మేనేజర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని తమ డిపోలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు

# ఐదుగురిపై కేసు నమోదు



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన భూలక్ష్మీ, గురువయ్య దంపతుల మధ్య ఉన్న కుటుంబ సమస్యలు దాడులు చేసుకునేందుకు దారితీశాయని ఎస్సై ఎన్. రామమోహన్ రెడ్డి తెలిపారు.శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు..పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన భూలక్ష్మీ సోదరులు భార్యభర్తల మధ్య సమస్యలపై పంచాయితీ చేయడానికి వచ్చారన్నారు. శుక్రవారం రాత్రి ఈ పంచాయితీ జరుగుతుండగా ఆమె భర్త, కొడుకు, మరిది, తోడికోడలు దాడిచేసి చేసినట్లు తెలిపారు.బాధితురాలు, ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకొని విచారణ చేపడుతున్నామన్నారు.

## బీజేపీ కృషితో కల్లూరులో తీరిన తాగునీటి కష్టాలు

### -తక్కువ ఖర్చుతో 15 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు.. అధికారులకు ఉలిందకొండ రవి ధన్యవాదాలు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు అర్బన్-2 పరిధిలోని 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, శివాలయం వీధిలో కొన్నేళ్లుగా నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడి సమస్య బీజేపీ చొరవతో పరిష్కారమైంది. కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై సుమారు 10 రోజుల క్రితం స్థానిక బీజేపీ నాయకత్వాన్ని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన బీజేపీ కల్లూరు అర్బన్-2 అధ్యక్షుడు ఉలిందకొండ రవి, స్థానిక మహిళలతో కలిసి నేరుగా మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య తీవ్రతను వివరించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు ప్రారంభించారు.



**తక్కువ వ్యయంతో కనెక్షన్లు:** కాలనీలో మొత్తం 25 గృహాలకు నూతన పైప్‌లైన్ ద్వారా కొళాయి (ట్యాప్) కనెక్షన్లు అవసరం కాగా, మొదటి విడతగా యుద్ధప్రాతిపదికన 15 ఇళ్లకు పైప్‌లైన్ వేసి కనెక్షన్లు పూర్తి చేశారు. సాధారణంగా ఒక్కో నల్లా కనెక్షన్‌కు సుమారు ?20,000 వరకు వ్యయం అవుతుందని, అయితే పేద ప్రజల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కేవలం ?4,500 లేబర్ కూలీ ఛార్జీలతోనే పనులు పూర్తి చేయించడం విశేషమని ఉలిందకొండ రవి తెలిపారు. ప్రజల కష్టాలను గుర్తించి సత్వరం స్పందించిన మున్సిపల్ అధికారులు, సిబ్బందికి కాలనీ ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ నిరంతరం ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.

# అధునాతన ట్రాఫిక్ అవగాహన
## వాహనాన్ని ప్రారంభించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్.

- ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి.
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి -- రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి.
- ప్రజలు, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందుకే ఈ ప్రత్యేక కార్యక్రమం.





పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబం ధనలపై ప్రజల్లో విస్తృత అవగా హన కల్పించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద అధునాతన ట్రాఫిక్ అవగా హన వాహనాన్ని కర్నూలు జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ విలేకరులతో మా ట్లాడుతూ కర్నూలు నగరంలో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై మరింత అవగాహన కల్పించేందుకు డిజి టల్ స్క్రీన్‌తో కూడిన అధునా తన అవగాహన వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ డిజిటల్ స్క్రీన్ పై ట్రాఫిక్ నిబం ధనలపై అవగాహన కల్పించే వీడియోలను ప్రదర్శిస్తామన్నారు

హెల్మెట్ ధరించకపోవడం మ ద్యం సేవించి వాహనాలు నడప డం, వేగ నియంత్రణ లేకపోవ డం , సిగ్నల్స్ జంపింగ్, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వంటి తదితర రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యా లను కూడా ప్రదర్శించి, ప్రమాదా ల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

కర్నూలు నగరంలో ఒకే ప్రాంతా నికి పరిమితం కాకుండా రద్దీ ప్రాంతాలను గుర్తించి, వివిధ ప్రదేశాల్లో, వివిధ సమయాల్లో ఈ అవగాహన వాహనం ద్వారా ప్రజలకు, వాహనదారులకు ట్రా ఫిక్ నిబంధనలపై అవగాహన కల్పి స్తామన్నారు. ట్రాఫిక్ పోలీ సులు కేవలం నిబంధనలు ఉల్లం ఘించిన వారికి జరిమానాలు విధించడమే కాకుండా, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వ హిస్తున్నారన్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధారణపై విస్తృతంగా అవగాహన కార్య క్రమాలు చేప డుతున్నామన్నారు. ద్వి చక్ర వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, అతివేగంగా వాహనా లు నడపడం వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని నివారించేందుకు ప్రజల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు నగరంలో అవ సరమైన ప్రాంతాల్లో డివైడర్లు, వన్‌వేలు ఏర్పాటుచేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తు న్నామన్నారు. ప్రతిఒకరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్ ధరించి, సీట్ బెల్టులు ధరించి, సురక్షితంగా వాహనా లు నడపాలని కర్నూలు ఎస్పీ సూచించారు.రోడ్డు ప్రమాదాల నివా రణకు ప్రజలు పోలీసులకు సహకరిం చాలని కోరారు. అనంతరం సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమానికి సహకరిం చిన దాతలకు కర్నూలు ఎస్పీ జ్ఞాపి కలు అందజేశారు. ఈ కార్య క్రమంలో అడి షనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, హోంగార్డ్స్ డీఎస్పీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, కర్నూ లు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేర దర్యాప్తులో ప్రతిభకు పట్టం

### కుషాయిగూడ ఎస్సై నిర్మల వెంకన్నకు ఉత్తమ దర్యాప్తు అధికారిగా పురస్కారం



కుషాయిగూడ, ఆగస్టు 22: నేర కేసుల దర్యాప్తులో ప్రతిభ కనబరుస్తూ, నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు సాగించిన కుషాయిగూడ సబ్‌ఇన్‌స్పెక్టర్ నిర్మల వెంకన్నకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన సేవలను గుర్తించిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఉత్తమ దర్యాప్తు అధికారిగా పురస్కారం అందజేశారు. నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. కేసు నమోదు చేసిన నాటి నుంచి దర్యాప్తును శాస్త్రీయ పద్ధతిలో ముందుకు తీసుకెళ్లడం, ఆధారాలను సేకరించడం, నిందితులను గుర్తించడం, న్యాయస్థానంలో నేరం రుజువై శిక్ష పడే వరకు కేసును సమర్థవంతంగా నడిపించడంలో ఎస్సై వెంకన్న చూపిన ప్రతిభను ఉన్నతాధికారులు అభినందించారు. గతంలో జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన సమయంలోనూ ఎస్సై వెంకన్న తనదైన ముద్ర వేశారు. భూకబ్జాదారులు, రౌడీషీటర్ల ఆగడాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అండగా నిలిచి, చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టారు. పలువురు భూకబ్జాదారులపై పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు తరలించడంలో కీలకంగా వ్యవహరించారు. దీంతో ప్రజలకు రక్షణ కల్పించే అధికారిగా ఆయనకు గుర్తింపు లభించింది. విధి నిర్వహణలో నిబద్ధత, దర్యాప్తులో పకడ్బందీతనం, ప్రజలకు న్యాయం చేయాలనే తపనతో ఎస్సై నిర్మల వెంకన్న ముందుకు సాగుతున్నారని పోలీసు అధికారులు ప్రశంసించారు. ఉత్తమ దర్యాప్తు అధికారిగా పురస్కారం అందుకోవడం ఆయన సేవలకు దక్కిన గుర్తింపుగా పలువురు పేర్కొన్నారు.

# పరిశుభ్రతే ప్రగతికి మూలం: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

### మహాలక్ష్మి నగర్ పార్కులో ఘనంగా 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'






పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పరిసరాల పరిశుభ్రతను కాపాడటంతో పాటు ప్రజల్లో స్వచ్ఛతపై నిరంతరం చైతన్యం తీసుకురావడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని పాణ్యం శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి ఉద్ఘాటించారు. కల్లూరు అర్బన్ 21వ వార్డు పరిధిలోని దిన్నెదేవరపాడు రోడ్డులో ఉన్న మహాలక్ష్మి నగర్ పార్కులో 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, మున్సిపల్ అధికారులు, కూటమి శ్రేణులతో కలిసి ప్రత్యక్ష పారిశుధ్య పనుల్లో భాగస్వామ్యమయ్యారు. సమన్వయంతోనే స్వచ్ఛ సమాజం: ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రమైన వాతావరణమే తొలి మెట్టు అని పేర్కొన్నారు. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యం తోడైనప్పుడే స్వచ్ఛాంధ్ర లక్ష్యం సంపూర్ణంగా నెరవేరుతుందన్నారు. పాల్గొన్న ప్రముఖులు: కార్యక్రమంలో నగర మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె. పార్వతమ్మ, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.కె. శ్రీనివాసరావు, వార్డు నాయకులు రాఘవేంద్ర రెడ్డి, దివాకర్ రెడ్డి, లక్ష్మణ స్వామి, వెంకటేష్ చౌదరి, సుదర్శన్ రెడ్డి, భరత్ నాయక్, సుధాకర్, గంగాధర్ గౌడ్ లతో పాటు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

### సాగునీరు లేక బోసిపోయిన రిజర్వాయర్లు.. ఎండిపోతున్న పంటలు

మంత్రాలయం, ఆగస్టు 22 (పల్లె వెలుగు): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రచ్చుమర్రి గ్రామ శివారులోని రిజర్వాయర్లు, ఎండిపోతున్న పంట పొలాలను వైఎస్సార్సీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రిజర్వాయర్లు, తుంగభద్ర నది, ఎల్లెల్సీ కాలువల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఏపీకి రావాల్సిన నీటి వాటాను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతులకు పంట నష్టపరిహారం, బీమా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కర్నూలు కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఆర్. పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు జి. భీమారెడ్డి, సి.వి. కాంతారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



# నెలాఖరుకు వెలుగోడు రిజర్వాయర్ను ముట్టడిస్తాం



## - రైతు వ్యతిరేకి కూటమి ప్రభుత్వం -మాజీ ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 22:** రైతు ప్రయోజనాల కోసం ఈ నెల ఆఖరుకు వెలుగోడు రిజర్వాయర్ ను, బానకచర్లను ముట్టడించి తీరుతామని శ్రీశైలం నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు శిల్పా చక్రపాణి ప్రకటించారు. ఇందుకు సంబంధించి రైతులను చైతన్యవంతులను చేసేందుకుగాను శనివారం బండి ఆత్మకూరు మండలంలో శిల్పా పర్యటించారు. ముందుగా ఈర్నపాడు గ్రామంలో శిల్పా పర్యటించి తెలుగంగ కాలువ కింద రైతులు వేసుకున్న పంట పొలాలను పరిశీలించారు. ఇప్పటికే పెట్టుబడుల రూపంలో రైతులు వరి సాగుకు గాను వేలాది రూపాయలను ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. మరో రెండు రోజుల్లో నీళ్లు పొలాలకు అందకపోతే రైతులు దారుణంగా దెబ్బతీసే పరిస్థితులు నెలకొంటాయని అన్నారు. రైతు సంక్షేమం అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేకి ప్రభుత్వంగా మారిపోయిందని అన్నారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని కనీసం ఖరీఫ్ సీజన్ లో కూడా నీళ్లు ఇవ్వలేని కూటమి ప్రభుత్వం దుర్మార్గమైన పాలన కొనసాగిస్తుందని అన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో వెలుగోడు రిజర్వాయర్ లో మూడు టీఎంసీల నీళ్లు ఉన్న, తెలుగంగ కాలువ ద్వారా రైతులకు నీళ్లు ఇప్పించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయి, మా గొంతులు తడపండి మహాప్రభో! అని మొత్తుకుంటున్న ప్రభుత్వం కనికరించడం లేదని అన్నారు. తాము ఎక్కడ ఆందోళన చేపడతామని భయపడి నేడు పోతిరెడ్డిపాడు నుండి 7వేల క్యూసెక్కుల నీటిని వెలుగోడు రిజర్వాయర్కు మళ్లిస్తున్నారని అన్నారు. రైతుల విషయంలో అన్యాయం చేస్తూ మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వాన్ని నిద్ర లేపుతామని అన్నారు. సోమవారం నాడు రైతులతో కలిసి పోతిరెడ్డిపాడును సందర్శిస్తామని శిల్పా ప్రకటించారు.

### ఓట్ల కోసం రాలేదు

శనివారం మధ్యాహ్నం లింగాపురంలో జరిగిన రైతుల సమావేశంలో శిల్పా మాట్లాడుతూ తాను ఓట్లు అడిగేందుకు గ్రామానికి రాలేదని అన్నారు. సాగునీటి కోసం రైతులు పడుతున్న కష్టాలు చూసి వారిని చైతన్య పరిచి నిరసన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వం మెడలు వంచాలన్న ఉద్దేశంతో గ్రామాలను సందర్శించడం జరుగుతుందని అన్నారు. గ్రామాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే మంత్రులను నీళ్ల విషయంపై రైతులు నిలదీయాలని పిలుపునిచ్చారు. శ్రీశైలం డ్యాం లో 180 టీఎంసీల నీళ్లు ఉన్నప్పటికీ, రైతులకు ఎందుకు నీళ్లు ఇవ్వలేకపోతున్నారో నాయకులు సమాధానం చెప్పాలని శిల్పా పేర్కొన్నారు. వెలుగోడు రిజర్వాయర్ లో ఆరు టీఎంసీల నీళు ఉన్నప్పటికీ తెలుగు గంగ కాలువకు ఎందుకు నీళ్లు వదలడం లేదని శిల్ప ప్రశ్నించారు. రైతుల విషయంలో ప్రభుత్వం కళ్లు తెరవకపోతే వ్యవసాయ రంగం, ఆహార భద్రత పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని శిల్ప హెచ్చరించారు. రైతులు నీళ్ల కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి అందరిని సమైక్యపరిచి రిజర్వాయర్లను ముట్టడించి, తమ ఆందోళనను తెలియజేస్తామని శిల్పా పేరు కొన్నారు. అనంతరం సాయంత్రం పార్నపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు సంజీవరెడ్డి, సంత జుటూరు,పెద్దదేవలాపురం,నారాయణపురం, చిన్నదేవలాపురం, జిసి పాలెం,ఈర్నపాడు, కడమల కాలువ, గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

### ఎల్లినో ప్రభావంతో రైతులకు కష్టాలు

ఎల్లినో ప్రభావం కారణంగా కర్నూలు కడప కాలువ రైతులతోపాటు తెలుగు గంగ కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులకు కష్టాలు మొదలయ్యాయి. దశాబ్దాల కాలం నుండి కర్నూలు కడప కాలువలు కింద తోపాటు తెలుగు గంగ కాలువ కింద రైతులు ఖరీఫ్ రబీ సీజన్లో రెండు కార్లు పుష్కలంగా వరిని సాగు చేస్తూ ఉన్నారు, గత రెండు సంవత్సరాల కాలంలోనూ రైతులు వరిని సాగు చేసి అధికంగా దిగుబడులను పొందారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఉష్ణోగ్రతల ప్రభావం కారణంగా, వర్షాలు ఆగిపోవడంతో పాటు వాతావరణం కూడా వేడెక్కుతున్న పరిస్థితులు నెలకొంటూ ఉన్నాయి. ఎల్నినో ప్రభావం కారణంగా కేసి, తెలుగు గంగ కాలువలకు నీటిని విడుదల చేసే పరిస్థితులు లేవని, రైతులు ఈ విషయాన్ని గుర్తించి ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని, గత కొద్ది కాలం నుండి ప్రభుత్వము, జిల్లా కలెక్టర్ పదేపదే హెచ్చరిస్తున్నారు. శాస్త్రవేత్తల ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఈ విషయంపై అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ





రైతులు మొండి ధైర్యంతో వరి సాగుకు పూనుకున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో నిండుగా నిలువు ఉన్నాయని, తర్వాత అయినా కాలువకు నీళ్లు వదలక పోతారని రైతులు ఆశగా ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితిలు నెలకొంటూ ఉన్నాయి. తాగునీటి కోసం మాత్రమే నీటిని నిలువ చేస్తూ ఉన్నారన్న నగ్న సత్యాన్ని రైతులు గుర్తించడం లేదు. ఎల్లినో ప్రభావం ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది జూలై నాటికి కూడా వర్షాలు కురియకపోతే, సాగునీటి మాట అటు పక్కనపెడితే, తాగునీటి కోసం కూడా తంటాలు పడే దుర్భరమైన పరిస్థితులు కూడా నెలకొనే ప్రమాదం ఉంది. ఇప్పటికే తాగునీటి కోసం జిల్లాలో చాలా గ్రామాలు తల్లడిల్లి పోతూ ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు బానకచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సంత జూటూరు పికప్ ఆనకట్ట నుండి గత నాలుగు రోజుల నుండి 500 క్యూసెక్కుల నీటిని ఉయ్యాలవాడ మండలం వరకు వదలడం జరిగింది. ప్రస్తుతం ఆ నీరు రాజోలి ఆనకట్ట వరకు చేరడం జరిగింది. బానకచర్ల వద్ద నీటి సరఫరా నిలిచిపోవడంతో సంత జుట్టు పికప్ ఆనకట్ట నుండి కుందూ నదికి నీటి సరఫరాను అధికారులు శనివారం నిలిపివేశారు. రైతులు ఇప్పటికైనా తమ ప్రయత్నాలను విరమింపజేసుకొని, ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నంద్యాలలో ప్రధమ రాయలసీమ జోనల్ తైక్వాండో పోటీలు ప్రారంభం.

### పోటీలు ప్రారంభించిన కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ.

**☛రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహణ.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఉమ్మడి కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్. టి . చంద్రమౌళి, జిల్లా కార్యదర్శి సర్దార్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధమ రాయలసీమ జోనల్ స్థాయి తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలను ఉమ్మడి కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్, అంతర్జాతీయ లయన్స్ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, టోర్నమెంట్ స్పాన్సర్ ఎం.బి.టీ. బాబు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ లో తైక్వాండో క్రీడ ఒలింపిక్స్ లో గుర్తింపు పొందిన క్రీడ అన్నారు. తైక్వాండో క్రీడ విద్యార్థుల శారీరక ధారుడ్యాన్ని పెంచి, ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింప చేస్తుందని అన్నారు. ఎం.బి.టీ. బాబు మాట్లాడుతూ తైక్వాండో క్రీడ ను బాలికలు ఆత్మ రక్షణ కోసం తప్పకుండా నేర్చుకోవాలి అన్నారు. తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్ర మౌళి మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. తైక్వాండో శిక్షణ పలు పాఠశాలలలో కోచ్ లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ తోపాటు ఎం.బి.టీ.బాబు, రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి, జఖీ వుల్లా, అబ్దుల్లా, తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సర్దార్, కోచ్ లు మహబూబ్ భాష, బాలకృష్ణ,షానవాజ్, 200 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.

## శ్రీ మద్దిలేటి స్వామి ఆలయానికి చైర్మన్ గా ఉన్నాం ఎల్ల నాగయ్య ప్రమాణ స్వీకారం




బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి (ఆగస్టు 22):- నంద్యాల జిల్లా, బేతంచెర్లమండలం =.ా.రంగాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానానికి చైర్మన్ గా ఉన్నం యల్లా నాగయ్యను ఎన్నుకొని ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.

ఆయనతోపాటు కమిటీ మెంబర్లు గా మహేష్ కుమార్,సుబ్రహ్మణ్యం శర్మ,శ్రీలక్ష్మి,శేషపాని, భూపాల్ రెడ్డి, పద్మావతి,రమాదేవి, రజిని,చంద్ర శంకరి భాయ్ తిరుమలమ్మ, అదేవిధంగా ఆలయ అర్చకుడు శ్రీ పూజారి మద్దిలేటి స్వామి ఎక్స్-అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.

వీరు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే గారికి టిడిపి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆలయ అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కుందూ నదికి నీటి సరఫరా నిలిపివేత



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 22: కుందూ నదికి నీటి సరఫరాను శనివారం నిలిపివేశారు. బానగచెర్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వచ్చిన నీటితో బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సంత జూటూరు వద్దనున్న పిక్ అప్ ఆనకట్ట నుండి నాలుగు రోజుల నుండి కుందూ నదికి నీళ్లు వదిలారు. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుందూ నది నుండి ఉయ్యాలవాడ మండలం వరకు నీళ్లు వదిలారు. కుందు పరివాహక ప్రాంతాలలో వరిని సాగు చేసిన రైతులందరూ విద్యుత్ మోటార్ల ద్వారా తమ పొలాలకు నీళ్లు పారించుకున్నారు. అయితే కుందూనది ద్వారా వదిలిన నీరు రాజోలి ఆనకట్టవరకూ చేరుకోవడంతో కేసీ అధికారులు కుందూ నదికి నీటి సరఫరాను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

### మండల ప్రత్యేక అధికారి హరి గోపాల్



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 22 పల్లె వెలుగు : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి హరి గోపాల్ అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో ఏపీ ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ నందు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, టాయిలెట్స్ ను తనిఖీ చేసి పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలను స్వచ్ఛంగా పెట్టుకోవడం మన బాధ్యత అని ప్రత్యేక అధికారి తెలిపారు. అనంతరం హౌసింగ్ కు సంబంధించి పూర్తి కానీ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి సకాలంలో గృహాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్, బేగం పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com